

ఆరో సెమిస్టర్ ఫలితాలు విడుదల

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని స్వయంప్రతిపత్తి గల ప్రభుత్వ మహిళా కళాశాలలో డిగ్రీ విద్యార్థులు రాసిన ఆరో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శనివారం విడుదల చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ టి.ఆదిలక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో బిఎ, బిఎస్‌సి, బికాం విద్యార్థినులు ఆరో సెమిస్టర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 2021-22 విద్యా సంవత్సరంలో 618 మంది విద్యార్థినులు నమోదు కాగా, 413 మంది (66.8) శాతం విద్యార్థినులు డిగ్రీ పట్టా పొందడానికి అర్హత సాధించారని తెలిపారు. ఫలితాలు విడుదల సందర్భంగా కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులను అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్‌ను కోరిన పౌర సంక్షేమ వేదిక



వినతిపత్రం అందజేస్తున్న వేదిక ప్రతినిధులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగర పరిధిలోని ప్రజలు అనేక సమస్యలతో సతమత మవుతున్నారని, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని పట్టణ పౌర సంక్షేమ వేదిక ప్రతినిధులు శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియాను కోరారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో శనివారం కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నగర ప్రజలకు అందిస్తున్న తాగునీటి నిల్వ కోసం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేపట్టి ప్రజలకు శుద్ధ జలాలు అందించాలని కోరారు. చిన్నపాటి వర్షాలకు రోడ్లపైనే వర్షపునీరు నిలిచిపోతోందని, పిఎస్ఎన్ఎం స్కూల్ నుంచి నాగావళి నదికి వెళ్లే ప్రధాన కాలువ, ఇందిరానగర్ నుంచి రామలక్ష్మణ కూడలి మీదుగా దిగువకు వెళ్లే మురుగు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. నగరం నడిబొడ్డున ఇందిరానగర్ కాలనీలోని పార్కు స్థలాన్ని డంపింగ్ ప్రదేశంగా వాడుతున్నారని, దీనివల్ల చుట్టూ ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. పెద్ద రెల్లివీధి, తుమ్మావీధిలో ప్రజల అవసరాల కోసం నిర్మించిన ప్రజా మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. కమిషనర్‌ను కలసిన వారిలో వేదిక కన్వీనర్ ఎం.గోవర్ధనరావు, సభ్యులు ఎం.ఆదినారాయణమూర్తి, పద్మావతి, బి.రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి మధ్యవర్తిత్వంపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం లీగల్

ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు మధ్యవర్తిత్వంపై న్యాయవాది మధ్యవర్తులకు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. జిల్లా కోర్టులోని ఆయన ఛాంబరులో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వం, సంధి ప్రాజెక్టు కమిటీ మధ్యవర్తిత్వ భావన, సాంకేతికతలపై 40 గంటల పాటు మధ్యవర్తిత్వ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రతిపాదించిందని తెలిపారు. జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలులో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట కోర్టు పరిధిలోని లీగల్ సర్వీసెస్ కమిటీల చైర్మన్లు, అడ్వకేట్ మధ్యవర్తులు ఈ శిక్షణలో పాల్గొంటారని తెలిపారు. 18న ప్రారంభ సెషన్‌తో శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. సమావేశంలో న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దందా

- అడ్డగోలుగా వసూలు
- నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోటు బుక్స్ విక్రయాలు
- అడిగే వారు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలు



పాఠశాలలు పున: ప్రారంభం కావడంతో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల దోపిడీ పర్వానికి తెరతీశాయి. ఫీజులతో పాటు పాఠ్య పుస్తకాలు, నోటు బుక్స్ ధరలనూ పెంచి తమ గల్లా పెట్టెను నింపుకుంటున్నాయి. పుస్తకాలు, యూనిఫాం విక్రయించకూడదని నిబంధనలు చెప్తున్నా బేఖాతరు చేస్తున్నాయి. ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేకపోవడంతో ప్రయివేట్ యాజమాన్యాల దోపిడీకి అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నాయి. ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు వసూళ్లు చేస్తున్న సొమ్ములు భారీగా ఉండడంతో పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు నలిగిపోతున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 3,053 ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 1995, ప్రాథమికోన్నత పాఠశాలలు 469, ఉన్నత పాఠశాలలు 589 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 2,655 ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలు 1916, ప్రాథమికోన్నత 332, ఉన్నత పాఠశాలలు 407 ఉన్నాయి. జిల్లాలో గుర్తింపు పొందిన ప్రయివేట్ పాఠశాలలు 398 ఉన్నాయి. వాటిలో ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ 394, సిబిఎస్ఇ సిలబస్‌తో నడుస్తున్న ప్రయివేట్ అన్ ఎయిడెడ్ నాలుగు ఉన్నాయి. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో కలిపి మొత్తం 2.90 లక్షల పైబడి విద్యార్థులు చదువుతున్నారు.

భారీగా ఫీజుల వసూలు

విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు ఫీజుల దోపిడీకి తెరలేపాయి. పరీక్షల్లో ఫలితాలు, స్కూళ్ల స్టైంత్, పేరెంట్స్ మోజు బట్టి యాజమాన్యాలు ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఫీజులు కొంతవరకు అందుబాటులో ఉన్నా పట్టణ, నగర పరిధిలోని స్కూళ్లలో మాత్రం భారీగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేట్ స్కూళ్లలో ఎల్‌కెజి విద్యార్థికి గరిష్టంగా రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. పలాస, టెక్కలి, ఆమదాలవలస వంటి ప్రాంతాల్లో ఎల్‌కెజి విద్యార్థికి రూ.20 వేల వరకు తీసుకుంటున్నారు. శ్రీకాకుళం నగరంలో మాత్రం భారీగా ఫీజులు ఉన్నాయి. ఎల్‌కెజి విద్యార్థికి ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన కొన్ని పాఠశాలల్లో యాజమాన్యాలు వసూలు చేస్తున్న ఫీజులు వింటే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఒక ప్రయివేట్ పాఠశాలలో ఎల్‌కెజి విద్యార్థికి రూ.50 వేలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

పుస్తకాల ధరలనూ పెంచేశారు

ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో వారి చెప్పిందే ధరగా ఉంటోంది. ఈ ఏడాది 30 నుంచి 40 శాతం వరకు పుస్తకాల ధరలను పెంచేశారు. ప్రభుత్వ పుస్తకాలు మినహా వారి సిలబస్‌కు సంబంధించిన పుస్తకాలు, నోట్‌బుక్స్ తమ స్కూళ్లలో కొనాల్సిందేనని యాజమాన్యాలు హుకుం జారీ చేస్తున్నాయి. దీంతో బయట మార్కెట్‌తో పోలిస్తే ప్రయివేట్ స్కూళ్లలో ధరలు ఎక్కువగా ఉన్నా తల్లిదండ్రులు తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే కొంటున్నారు. శ్రీకాకుళం నగరంలోని ఒక ప్రయివేట్ స్కూల్‌లో గత సంవత్సరం మూడో తరగతి పుస్తకాలకు రూ.2,600 వసూలు చేయగా, ఈ ఏడాది రూ.3,200 తీసుకుంటున్నారు. నోట్ పుస్తకాల ధరలనూ పెంచేశారు. బయట మార్కెట్‌లో రూ.25 ఉండే నోట్ పుస్తకాన్ని రూ.36 తీసుకుంటున్నారు. ఒక కార్పొరేట్ స్కూల్‌లో ఏడో తరగతి విద్యార్థికి గతేడాది రూ.7,300 తీసుకోగా, ఈ సంవత్సరం రూ.8,200 వసూలు చేస్తున్నారు.

జూన్ వచ్చిందంటే తల్లిదండ్రుల్లో టెన్షన్

స్కూళ్లు తెరుస్తున్నారంటే చాలు తల్లిదండ్రుల్లో టెన్షన్ మొదలవుతుంది. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని, తాము సరిగా చదువుకోలేకపోయినా వారిని బాగా చదించాలని కోరుకుంటున్న తల్లిదండ్రులు నలుగురితో పాటు వారి పిల్లలనూ ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లలో చదివిస్తున్నారు. ముఖ్యంగా చిరుద్యోగులు, ప్రయివేట్ ఉద్యోగులు తమ జూన్ నెల జీతమంతా వెచ్చించినా చాలకపోవడంతో అప్పు చేసి మరీ ఫీజులు కడుతున్నారు.

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి



పాఠశాలలు తెరవగానే ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లు, కాలేజ్‌లు అడ్డగోలుగా ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నాయి. పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అధిక ధరలకు అమ్ముతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలు, కళాశాలల్లో ఎటువంటి అమ్మకాలు చేపట్టకూడదు. అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి.

- బి.హరీష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులపై తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఫలానా స్కూల్‌లో ఎక్కువ డబ్బులు తీసుకుంటున్నారని లిఖితపూర్వకంగా రాసిస్తే చర్యలు చేపడతాం. ఫీజుల వివరాలకు సంబంధించి స్కూళ్లలో తప్పనిసరిగా బోర్డులు ప్రదర్శించాలి. పాఠశాల్లో పుస్తకాలు, యూనిఫారాలు విక్రయించడం నిబంధనలకు విరుద్ధం.

- కె.వెంకటేశ్వరరావు
జిల్లా విద్యాశాఖ అధికారి

శ్రీశ్రీ రచనలు చైతన్య గీతికలు



శ్రీశ్రీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న అప్పలనాయుడు తదితరులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీశ్రీ తన కవితలు, గేయాలతో ప్రజా చైతన్యాన్ని రగలించారని ప్రముఖ కథా రచయిత అట్టాడ అప్పలనాయుడు అన్నారు. నగరంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఆధ్వర్యాన శనివారం నిర్వహించిన శ్రీశ్రీ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కవిత్వపు ఆంక్షల సంకెళ్లను తెంచి కవితా సరస్వతికి స్వేచ్ఛ కల్పించిన విప్లవ కవి శ్రీశ్రీ అని కొనియాడారు. సమాజంలోని కుళ్లును సమూలంగా నిర్మూలించి మరో ప్రపంచం కావాలని ఆకాక్షించారని గుర్తు చేశారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె మూర్తి మాట్లాడుతూ సమ సమాజ స్థాపన లక్ష్యంగా అద్భుత సాహిత్యాన్ని తెలుగు ప్రపంచానికి అందించిన కవి దిగ్గజం శ్రీశ్రీ అని అన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవులు కుప్పిలి వెంకటరాజారావు, కంచరాన భుజంగరావు, తంగి ఎర్రమ్మ, వాసవి, నెట్టిమి, రమణరావు, పత్తి సుమతి స్వీయ కవితా పఠనం చేశారు. ప్రజా కళాకారుడు చింతాడ రామచంద్రరావు కొన్ని శ్రీశ్రీ గేయాలను ఆలపించారు. అంతకుముందు శ్రీశ్రీ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎం.ప్రభాకర్, ఉదయ్ కిరణ్, బాడాన శ్యామలరావు, దివాకర్, మహిళా నాయకులు కె.నాగమణి, ఎ.లక్ష్మి, డి.సుధామణి తదితరులు పాల్గొన్నారు.

బక్రీద్‌కు పటిష్ట బందోబస్తు : ఎస్‌పి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 17న ప్రశాంత వాతావరణంలో ముస్లిం సోదరులు బక్రీద్ పండగను నిర్వహించుకునేలా జిల్లాలోని ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో సంతోషంగా బక్రీద్ చేసుకోవాలని కోరారు. ఆవులను ఒక చోట నుంచి మరో చోటుకు తరలించే క్రమంలో తగిన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. లేకుంటే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోవులను వధించడం నిషేధమని, చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన శిక్షలు తప్పవని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా గోవుల రవాణాపై నిరంతర నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో ఏదైనా అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే శ్రీకాకుళం జిల్లా పోలీసు వాట్సాప్ నంబరు 6309990933కు సమాచారాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

కక్షసాధింపు పాలన ఉండదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

ప్రజాశక్తి - పలాస


టిడిపి ప్రభుత్వంలో కక్షసాధింపులు ఉండవని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలన అందిస్తామన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం మాదిరిగా అక్రమ కేసులు, జెసిబిలతో కూల్చివేతలు, దాడులు, కక్షసాధింపు చర్యలు ఉండవని చెప్పారు. టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ వంటి ఎంతోమంది అప్పలరాజు బాధితుల్లో ఉన్నారని చెప్పారు. ఐదేళ్లలో ఎంతోమంది ఆస్తులు కబ్జాలకు గురయ్యాయని, ఎంతోమందిపై దాడులు జరిగాయన్నారు. వీటన్నింటిపై దర్యాప్తు చేయిస్తామన్నారు. ఈ ఐదేళ్లలో వ్యాపారవర్గాలను వేధించారని, డాక్టర్లనూ వదలకుండా వారి మందుల కంపెనీ మందులే కొనుగోలు చేయాలని అప్పలరాజు బెదించారని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కిడ్నీ ఆస్పత్రి వద్ద వైఎస్ఆర్ పేరు ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు తొలగిస్తే, ప్రెస్‌మీట్ పెట్టి మరీ ప్రజలకు తప్పుడు సమాచారం అందించారన్నారు. తనకు వచ్చిన మెజారిటీ అప్పలరాజుపై ఉన్న వ్యతిరేకత అని ఆయన గుర్తించాలన్నారు. ఇప్పటివరకు భయపడి బయటకు చెప్పుకోలేని బాధితులు ఎవరైనా వారి సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే రెండు వారాల్లో పరిష్కరిస్తామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బందులకు గురిచేయకుండా సేవ్ పలాస సేఫ్ పలాసగా తీర్చిదిద్ది సుపరిపాలన అందిస్తామన్నారు. సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తామన్నారు. అసలు ఎందుకు ఓటమి పాలయ్యామో జగన్ ఆత్మపరిశీలన చేసుకోకుండా మళ్లీ అధికారం గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో ప్రజలకు చేసిందేమీ లేకనే ప్రజలు వారిని చిత్తుగా ఓడించారని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు వజ్జ బాబూరావు, బడ్డ నాగరాజు, పి.విఠల్. గురిటి సూర్యనారాయణ. మల్లా శ్రీనివాసరావు, గాలి కృష్ణారావు, యవ్వారి మోహనరావు, అంబటి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే గొండు శంకర్


ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్ర గ్రంథాలయ అభివృద్ధికి అన్నివిధాలుగా కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గ్రంథాలయంలో కనీస మౌలిక సదుపాయాలకూ నోచుకోలేదన్నారు. మున్సిపాలిటీ నుంచి రావాల్సిన గ్రంథాలయ పన్నులూ సకాలంలో అందక సిబ్బందికి కూడా జీతాలు చెల్లించలేని పరిస్థితి ఉందన్నారు. పంచాయతీ నిధులను గల్లంతు చేయడం వల్ల కూడా గ్రంథాలయాలకు ఈ దుస్థితి ఏర్పడిందని చెప్పారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సహకారంతో నిరుద్యోగ అభ్యర్థులకు అవసరమైన అన్ని పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. గ్రంథాలయంలో మౌలిక వసతుల సమస్యలను నిరుద్యోగ అభ్యర్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆయన స్పందిస్తూ గ్రంథాలయంలో ఫ్యాన్లు, మరుగుదొడ్లు, కంప్యూటర్లను రెండు రోజుల్లో బాగు చేయించి అందుబాటులోకి తెస్తానని హామీనిచ్చారు. దాతలు ముందుకు వచ్చి గ్రంథాలయంలో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని పిలుపునిచ్చారు. తద్వారా వారు నిరుద్యోగులకు అండగా నిలిచినవారవుతారని చెప్పారు. గ్రంథాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే పిలుపునకు స్పందిస్తూ మాజీ కౌన్సిలర్ కెల్లా కొండలరావు, శ్రీ శయన సంఘం జిల్లా అధ్యక్షులు మండల మన్మథరావు రూ.పది వేలు చొప్పున, వేట పద్మ రూ.ఐదు వేలు విరాళంగా ప్రకటించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, టిడిపి నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్, నాగేంద్ర యాదవ్, తోనంగి వెంకన్న, మైలపల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఆదిలోనే అసంతృప్తి





ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపిలో ఆదిలోనే అసంతృప్తి రాజుకుంది. కేబినెట్‌లో మంత్రి పదవులు దక్కకపోవడం ఇందుకు కారణంగా ఉంది. మంత్రివర్గంలో తీసుకునే ఎమ్మెల్యేల్లో ఇద్దరు, ముగ్గురు పేర్లు పరిశీలిస్తారని ప్రచారం జరిగింది. వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో పాటు ఆమదాలవలస, ఇచ్ఛాపురం ఎమ్మెల్యేలు కూన రవికుమార్, బెందాళం అశోక్ పేర్లు వినిపించినా, చివరకు అచ్చెన్నాయుడుకే మంత్రి పదవి వరించింది. పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోవడంతో ఒకే కుటుంబంలో ఇద్దరికి పదవి ఇచ్చే పరిస్థితి లేదన్న వాదనతో కళింగ సామాజిక తరగతికి తరగతికి చెందిన ఎమ్మెల్యేలు తమకు ఆ పదవి రావచ్చని నమ్మకం పెట్టుకున్నారు. ప్రధానంగా కూన రవికుమార్ అనుచరులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. చివరి క్షణంలో మారిన సమీకరణాలతో ఆశావహుల అనుచరులకు కొంత షాక్ తగిలినట్లయింది. ముఖ్యంగా కూన రవికుమార్‌కు మంత్రి పదవి రాకపోవడంపై ఆ సామాజిక తరగతిలో తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతున్నారు. తమ సామాజిక తరగతికి అన్యాయం చేశారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాకు ఈనెల 17న రానున్న కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన, ర్యాలీలో పాల్గొనకూడదని పలు నియోజకవర్గాలకు చెందిన కళింగ సామాజిక తరగతి నాయకులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. మొత్తమ్మీద సామాజిక సమీకరణాల పేరుతో చేపట్టిన కేబినెట్ కూర్పు టిడిపిలో చిచ్చు పెట్టినట్లయింది.

మంత్రి పదవులు దక్కని సామాజిక తరగతులు, ఎమ్మెల్యేలు, వారి అనుచరులు ఒకరకమైన అసంతృప్తి ఉంటే, కేబినెట్ బెర్తులు దక్కినా సరైన శాఖలు దక్కలేదనే నిరాశ కింజరాపు అనుచరుల్లో నెలకొంది. పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుకు కేంద్రమంత్రి పదవి దక్కడంతో టిడిపి శ్రేణులతో పాటు జిల్లా ప్రజానీకమూ ఎంతో సంతోషపడింది. కేంద్ర ప్రభుత్వంలో కేబినెట్ హోదా దక్కడంతో ఏదేని ప్రాధాన్యమున్న మంత్రిత్వశాఖ కేటాయిస్తారని అంతా ఆశగా ఎదురుచూశారు. వారి ఆశలను అడియాశలను చేస్తూ కేంద్రంలోని కొత్త ప్రభుత్వం పౌర విమానయాన శాఖ కట్టబెట్టింది. సంపన్నులకే పరిమితమైన విమానయానం ఇవ్వడంపై ఆ పార్టీ నాయకులు పెదవి విరుస్తున్నారు. విమానయానశాఖ ద్వారా నిధులు వచ్చే పరిస్థితే లేనప్పుడు జిల్లాకు, రాష్ట్రానికి ఏం ఉపయోగమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

దీనిపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందన వేరే విధంగా ఉంది. అభివృద్ధి చేయాలనుకుంటే శాఖలతో పనేముందని, గతంలో తాను ఎంపీగా ఉంటూనే కొన్ని పనులు చేయించుకోగలిగానని చెప్పుకొచ్చారు. తాను ఇప్పుడు కేంద్రమంత్రిగా ఉండడం వల్ల ఇతర మంత్రిత్వశాఖల మంత్రులతో మాట్లాడి అభివృద్ధికి సంబంధించి కొన్ని రకాల పనులు చేయించుకునే అవకాశం కలుగుతుందని భరోసానిచ్చే ప్రయత్నం చేశారు. ఆ మేరకు బిజెపి ఎంతవరకు సహకరిస్తుందనేది వేచి చూడాల్సి ఉంది. ఎన్‌డిఎ మూడో పర్యాయ ప్రభుత్వ ఏర్పాటు తర్వాత కేబినెట్‌లో కీలక శాఖలను బిజెపి అట్టిపెట్టుకుని అంతగా ప్రాధాన్యం లేని శాఖలను మిత్రపక్షాలకు కేటాయించిందన్న విమర్శలు వచ్చాయి. బిజెపి సీనియర్లకు కీలక శాఖలను కట్టబెట్టి, మిత్రపక్షాల మంత్రులు ఎవరికి వారు నిధులు విడుదల చేసుకునే అవకాశం లేకుండా బిజెపి తన సీనియర్లకు కట్టబెట్టి, ఆదిలోనే అట్టుకట్ట వేసిందన్న చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రం, జిల్లాకు ఎంతమేర నిధులు రాబట్టగలుగుతారనేది కేంద్రమంత్రి సమర్థతపై ఆధారపడి ఉంది.

జిల్లా నుంచి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్న కింజరాపు అచ్చెన్నాయుడుకి వ్యవసాయం, సహకార, మార్కెటింగ్ పాటు పశుసంవర్ధక, మత్స్యశాఖ అప్పగించారు. మంత్రిత్వశాఖ కేటాయింపుపై అచ్చెన్న అనుచరులను కొంత నిరాశకు గురి చేసినట్లు తెలుస్తోంది. మంత్రి అచ్చెన్నాయుడుకి హోంశాఖ కేటాయిస్తారని ఆశించిన కేడర్ కొంత అసంతృప్తికి గురైనట్లు తెలిసింది. అచ్చెన్నాయుడును వైసిపి ప్రభుత్వం కేసులతో వేధించిన సందర్భంలో పార్టీ అధికారంలోకి వస్తే తనకు హోంశాఖ కేటాయించాలని ఒకట్రెండు సందర్భాల్లో కోరారు. ఎన్నికల ప్రచార సమయంలోనూ కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ బాబాయ్ గెలిస్తే హోంశాఖ మంత్రి అవుతారంటూ చెప్పుకొచ్చారు. దీంతో తప్పనిసరిగా ఆయనకు హోంశాఖ వస్తాదని అంచనా వేసుకున్నారు. అచ్చెన్నాయుడుకి అప్పగించిన శాఖలు కూడా మరీ అంత ప్రాధాన్యం ఉన్న శాఖలేమీ కావనే అభిప్రాయం వినిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అప్పగించిన బాధ్యతను ఆయన ఎంతవరకు నెరవేరుస్తారు?, జిల్లా అభివృద్ధికి ఏవిధంగా తన శాఖను వినియోగిస్తారనేది చూడాల్సి ఉంది.

గతంలో కార్మికశాఖ మంత్రిగా అచ్చెన్నాయుడు బాధ్యతలు నిర్వర్తించినా, తమకేం చేశారన్న భావన కార్మికుల్లో ఇప్పటికీ ఉంది. జిల్లాలోని పలు పరిశ్రమల్లో కార్మికులను పనిలోకి తీసుకోకపోవడం, యాజమాన్యాలు కార్మిక చట్టాల ఉల్లంఘన, ఛార్టర్ ఆఫ్ డిమాండ్స్‌ను అమలు చేయకపోవడం వంటి సమస్యలతో పలుమార్లు మంత్రి అచ్చెన్నాయుడుని కలిసినా అవేవీ పరిష్కారం కాలేదన్న అభిప్రాయం కార్మికుల్లో ఉంది. ప్రస్తుతం ఆ విమర్శలను అధిగమించి జిల్లాకు మేలు చేస్తారని అంతా ఆశిస్తున్నారు.

విద్యార్థుల జీవితాలతో.. మోడీ చెలగాటం

ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షులు సాను

వార్త... మెయిన్‌లో

IN THE HON'BLE COURT OF ADDITIONAL SENIOR CIVIL JUDGTE AT SRIKAKULAM.
I.A.336/2022 in I.A.No.105/2021
In O.S.112/2008

Between:
Malla Kondayya ...Petitioner/plaintiff
And:
Aravala Bhaskararao (died) & Others ...Respondents/defendants
To,
R-2: Aravala Suryakumari w/o late Bhaskararao, aged 52 years, Household duties, residing at Ambalavala village, Gara mandal Srikakulam district presently residing at srikakulam town.
R-4: Aravala Suhasini w/o Someswararao, aged 27 years, --rest do-- Now residing at Hyderabad.
R-5: Aravala karthik, S/o Bhaskararao,aged 28years, Native of Ambalavala village, Gara mandal, srikakulam district Presently residing at Srikakulam town and district.

పై నెంబర్ గల దావాలో ఫైనల్ డిక్రీ పిటిషన్‌లో మీ హాజరు నిమిత్తం పైకోర్టులో తేది **25-6-2024 ఉ॥ గం॥ 10.30ని॥ లకు** పైకోర్టులో మీరు స్వయంగా గాని లేదా మీ లాయర్ గారి ద్వారా గాని హాజరై మీకెట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు వారికి తెలియ పరచుకోగలరు. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానం జరుగును.

// By court order //
కె. సుభాష్, న్యాయవాది,
శ్రీకాకుళం,సెల్: 9849140211.



తప్పెటగుళ్లను ప్రదర్శిస్తున్న కళాకారులు

ఉర్రూతలూగించిన తప్పెటగుళ్లు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

చేగువేరా జయంతి సందర్భంగా చిక్కోలు గుండెచప్పుడు తప్పెటగుళ్లు ప్రదర్శన యువతీ, యువకుల కేరింతల మధ్య ప్రదర్శించారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులు ఈ నెల 8 నుంచి 16 వరకు ఆమదాలవలస మున్సిపాలిటీ చింతాడలోని జి.ఎల్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం చేగువేరా జయంతిని పురస్కరించుని కల్చరల్ నైట్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం గుండె చప్పుడు తప్పెట గుళ్ల కళారూపాన్ని మండలంలోని బెండికి చెందిన కోనారి హేమ సుధన్ బృందం, మెళియాపుట్టి మండలం చీపురుపల్లికి చెందిన పాలిన శంకర్ బృందం యువతను కట్టిపడేసే అద్భుతమైన విన్యాసాలతో జానపద పాటలతో ఉర్రూతలుగించారు. అనంతరం కళాకారులకు ఎస్ఎఫ్ఐ ఆల్ ఇండియా అధ్యక్షులు పి.వి.సాను జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా తప్పెటగుళ్లు గురువులు కోనారి హేమ సూధన్ పాలిన శంకర్ మాట్లాడుతూ విద్యార్థుల కోసం చేసిన బృంద ప్రదర్శన తమ కళాకారులకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని అన్నారు. ఈ ప్రదర్శనలో హేమ సూధాన్, శంకర్, గణేష్, అశోక్ సాయి, దొరబాబు, కాళీ, బన్నీ పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న అన్నాజీరావు

ఆల్బమ్ పాట చిత్రీకరణ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మ్యూజిక్ సంస్థ బీట్ ల్యాబ్స్ ఇన్ఫినిటీ ఆధ్వర్యాన రాగోలు కూడలి వద్ద ఆల్బమ్ సాంగ్‌ను చిత్రీకరణను శనివారం ప్రారంభించారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు లాంఛనంగా ప్రారంభించారు. న్యాయవాది గురుగుబెల్లి నరసింహమూర్తి కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తంగుడు సురేష్ క్లాప్ కొట్టి షూటింగ్ ప్రారంభించారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా అందర్నీ అలరించే విధంగా ఆల్బమ్ సాంగ్స్‌తో పాటు జానపద, సాంస్కృతిక పాటలను నిర్మిస్తున్నామని సంస్థ అధినేతలు బగాది కిషోర్, మల్లాది దివాకర్, కన్నేటి శివరామిరెడ్డి, తలాస రవికుమార్‌లు తెలిపారు. మా సంస్థ ద్వారా నిర్మించిన 'ఆకాశం తాకిందా' అనే పాటను ఆరు బాషల్లో విడుదల చేశామని, ఎనిమిది లక్షలకు పైగా వ్యూస్ సాధించి ప్రజాదరణను పొందిందని గుర్తుచేశారు. ప్రస్తుతం నిర్మిస్తున్న పాటను జిల్లాలోని పలుచోట్ల చిత్రీకరించి విడుదల చేస్తామని తెలిపారు. ఈ పాటకు హీరోగా సూర్యభరత్ చంద్ర, హీరోయిన్‌గా సహ స్రారెడ్డి, డైరెక్టర్‌గా సందీప్ బద్దుల, మ్యూజిక్ డైరెక్టర్‌గా ఆది పొన్నాన్‌లు వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పేడాడ శ్రీధర్, తాండ్ర సునిల్, తాండ్ర సతీష్ బాబు, లఖినేని సునిల్, లక్కోజి దుర్గారావు పాల్గొన్నారు.

కళలకు ప్రోత్సాహం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



ధనుంజయరెడ్డి

మండలంలోని టి.బరంపురానికి చెందిన జానపద కళాకారుడు, కోలాటం పండరి భజన గురువు తిప్పన ధనుంజయరెడ్డికి తెలుగు వెలుగు సాహితి వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర శాఖలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంస్థ జాతీయ చైర్మన్ వలబోజు రాజకుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ధనుంజయరెడ్డి మాట్లాడుతూ కళలను ప్రోత్సహించి అభివృద్ధికి అహర్నిశలు కష్టపడతానని అన్నారు. ఈ ప్రాంతంలోని కళాకారులను వెలుగులోకి తేవడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఈయన ఎంపికపై జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, మిమిక్రీ ఆర్టిస్టు శివ, ప్రాంతీయ కళాకారు మృదంగ కళాకారులు గొణప లక్ష్మణమూర్తి తదితరులు అభినందించారు.

ఈ ఏడాదైనా సాగునీరు అందేనా?



శ్రీపురం ఎత్తిపోతల పథకం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని శ్రీపురం ఎత్తిపోతల పథకం ద్వారా శివారు భూములకు సాగునీరందించాలన్న ప్రజాప్రతినిధులు, ఆ గ్రామ రైతుల లక్ష్యం ఈ ఖరీపు సీజన్‌లో నెరవేర్చే పరిస్థితి కానరావటంలేదు. రూ.8 కోట్ల వ్యయంతో 2004లో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం కింద వెయ్యి ఎకరాలకు సాగునీరు అందుతుందని నిర్మాంచారు. అయితే ఈ ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చిన సాగునీరు శివారు గ్రామాలైన ఊడికలపాడు, దుర్గంపేట, ఉప్పరపేట అందడం లేదు. దీంతో ఆ గ్రామాల ప్రజల్లో కలిసి అప్పటి ఆ గ్రామ సర్పంచ్ గొండు లక్ష్మణరావు, అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకి విన్నవించుకున్నారు. ప్రజల కష్టాలను దృష్టిలో ఉంచుకొని అధికారులతో చర్చించి చీపుర్లపాడు పంచాయతీ పరిధిలో ఊడికలపాడు, ఎర్రబందకు నేరుగా ఈ సాగునీరు వెళ్తే ఆ గ్రామాలకు పూర్తిస్థాయిలో సాగునీరందుతుందని భావించారు. ఈ ఉద్దేశంతో 2016లో రూ.20లక్షల వ్యయంతో శ్రీపురం ఎత్తిపోతల పథకం నుంచి ఊడికలపాడు ఎర్రబంద చెరువు వరకు నేరుగా భూమిలో నుంచి పైపులైన్లు వేసి ప్రారంభించారు. అయితే ఆ ఏడాది మాత్రం పూర్తిస్థాయిలో అందకపోయిన 80 శాతం భూములకు సాగునీరందింది. దీంతో రైతులు సంతోషించారు. అంతే ఆ తరువాత ఈ ఐదేళ్లలో వంద ఎకరాలు సాగుకు నోచుకోక బీడు



పిచ్చిమొక్కలతో నిండిన కాలువ

భూములుగానే మిగిలిపోతున్నాయి. ఏదేమైనా గత ఐదదేళ్ల ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు నష్టపోయారు. ఈ యేడాది ఖరీపు సీజన్‌కైనా ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుండా సంబందిత ఎపిడిఐసిసి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి తమ పొలాలకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు.

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

ఉద్దాన ప్రాంతంలో సాగు చేస్తున్న జీడి పిక్కల 80 కేజీల బస్తా రూ.16 వేలుకు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జీడి రైతుల సంఘం నాయకులు ఎమ్మెల్యేను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జీడి రైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస కేంద్రంగా రాష్ట్రంలో జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక పిక్కలను కొనుగోలు చేసిన తర్వాతే విదేశీ పిక్కల దిగుమతులకు అనుమతి ఇవ్వాలని కోరారు. జీడి తోటల్లో అంతర కృషి పరికరాలు ఉచితంగా రైతులకు అందించాలన్నారు. జీడి పరిశోధన కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని కోరారు. జీడి పంట విస్తరణకు, జీడి తోటలు పునరుద్ధరణకు ప్రభుత్వం రాయితీలు, ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఎకరానికి జీడి తోట అభివృద్ధికి మూడేళ్లకు రూ.94 వేలు రైతులకు క్షేత్ర స్థాయిలో అందించాలని



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అజయ్‌కుమార్, తదితరులు

కోరారు. జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలన్నారు. రైతు వారీ సాగు విస్తీర్ణం నమోదు చేసి జీడి పంటకు వాతావరణ, బీమా అమలు చేయాలన్నారు. జీడి పంట ప్రాంతంలో జీడి పిక్కలు, జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాట్లు చేయాలని కోరారు. జీడి రైతులకు జీడి పిక్కలు ఆరబెట్టుటకు టార్పాలిన్లు ఉచితంగా పంపిణీ చేయాలని విన్నవించారు. వినతిపత్రం అందజేసిన వారిలో కుత్తుం వినోద్, కొండప్ప సూరేఖ, కోనేరు సురేష్, అంబటి రామకృష్ణ, యంపల్ల జోగారావు, మద్దిల రామారావు, మడ్డు రాఘవరావు, కోనేరు ఆదినారాయణ, పుచ్చ భాస్కరరావు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన 'కలమట'



పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరమణ

కొత్తూరు : టిడిపి జిల్లా పార్లమెంటరీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ సిఎం చంద్రబాబును శనివారం కలిశారు. విజయవాడ తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో టిడిపి నాయకులు గెలుపొందడంపై అభినందించారు.

నగరంలో అన్నదానం

శ్రీకాకుళం అర్బన్ : తల్లితండ్రుల రుణం తీర్చుకోలేనిదని జిల్ ఫౌండేషన్ అధ్యక్షులు సత్యసాయి అన్నారు. ఫౌండేషన్ సభ్యులు జాడ సాయి తల్లి శ్రీదేవి జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని గొంటి వీధిలోని పట్టణ పేదల నిర్మూలన భవనంలో తలదాచుకుంటున్న నిస్సహాయులకు శనివారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ హర్షవల్లి కార్యదర్శి మణిశర్మ, మదర్స్ లవ్ ఫౌండర్ సుప్రజ, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి సభ్యులు నవీన్, గిరజాల మహాలక్ష్మి, పొడుగు చరణ్, మదర్స్ హెల్పింగ్ సొసైటీ డాక్టర్ పైడి ప్రదీప్, నంది ఉమాశంకర్, జాడ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండకూడదు

ప్రజాశక్తి- రణస్థలం

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఒకటైన తాగునీరు అందించడమని, ఈ సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు చూడాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాయలంలో ఆర్‌డబ్ల్యుఎస్, కాంట్రాక్టర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులపై గ్రామాల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో పనిచేసి ప్రజలకు నీరు అందించాలన్నారు. ప్రభుత్వం తరుపున అందాల్సిన సహాయ సహకారాలకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో డిఇ సూర్యనారాయణ, ఎఇ భాగ్యలక్ష్మి, జెఇ రేవతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఇఆర్



పాతపట్నం : పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాఠ్యపుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీది జెడ్‌పిహెచ్ఎస్‌లో విద్యార్థులకు శనివారం పాఠ్యపుస్తకాలు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెంచాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. ఇదే పాఠశాలలో నేనూ చదువుకుని ఎమ్మెల్యేగా మీ ముందుకొచ్చానని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత ఉద్యోగాల్లో కొలువులను అధిరోహించాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు బెవర రామమూర్తి, శిమ్మ కృష్ణ పాల్గొన్నారు.


విత్తనాల పంపిణీ

మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. అలాగే గుమ్మగెడ్డ, పొగడవెల్లిగెడ్డలను ఆధునీకరణ చేపట్టి మరింత ఆయకట్టు పెంచుతామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జెడిఎ కోటగిరి శ్రీధర్, ఎడిఎ లింగాల వెంకటమధు, ఎఒ బొడ్డేపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

లావేరు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పెద్దలింగాలవలస సర్పంచ్ లుకలాపు అప్పలనాయుడు అన్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో అబ్బినాయుడు, బూటు సూర్యనారాయణ, మీసాల నారాయణరావు, వాళ్లే పాపినాయుడు, బూటు రమణ పాల్గొన్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీలోని ఎంపియుపి పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు, హెచ్ఎం రాజీవ్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులకు పంపిణీ చేశారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి



మృతి చెందిన ఆవులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో శనివారం పిడుగులతో కూడిన వర్షం కురిసింది. మండలంలోని కొల్లివలసకు చెందిన దూబ బౌరినాయుడుకు చెందిన ఆవు పొలంలో మేస్తుండగా... పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే మామిడివలసకు చెందిన రైతు పైల అప్పలనాయుడు చెందిన ఆవు మేత మేస్తుండగా పిడుగుపాటుకు మృతి చెందింది. విషయం తెలుసుకున్న మండల పశువర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకట్ వెళ్లి పరిశీలించారు. నష్టపరిహారం అందించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.

ఉరుములు, మెరుపులతో...

ఆమదాలవలస: రెండు రోజులుగా పగటిపూట ఎండ, సాయంత్రం అయ్యేసరికి చిరుజల్లులు కురుస్తుండడంతో ప్రజలు కాస్త ఉపశమనం పొందడంతో పాటు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం సాయంత్రం వాతావరణంలోని మార్పులతో ఒక్కసారిగా వర్షం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మండలంలో ఖరీఫ్ సాగు పనులు ప్రారంభిస్తున్న రైతులు వర్షం పడటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో దుక్కు దున్ని పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు ప్రస్తుత వర్షం మరో రెండు రోజుల్లో మంచి పదునుగా మారి వరి విత్తనాలు వేయడానికి అనుకూలంగా ఉంటుందనిభావిస్తున్నారు.

పాతపట్నం : మండలంలో కాగువాడ, ప్రహరాజపురం గోపాలపురం, గంగువాడ, తెంబూరులో మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఈదురుగాలితో ఓ మోస్తారుగా వర్షం కురిసింది. సుమారు గంటన్నర సమయం వర్షం కురవడంతో రైతులకు ఉపశమనం కలిగించింది. ఈ వర్షం రైతులు తొలకరి దుక్కి దున్నడానికి ఉపయోగపడుతుంది. పలుచోట్ల చెట్లు, కొమ్ములు విరిగి నేలకొరిగాయి.



సామగ్రిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

నాటుసారా స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి- సోంపేట

సోంపేట స్పెషల్ అండ్ ఫోర్స్‌మెంట్ అధికారులు మందస మండల పరిధిలోని నాటుసారా స్థావరాలపై శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ జైభీమ్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టినట్లు తెలిపారు. కొండలోగాం పంచాయతీ డబ్బాగాం గ్రామ సమీపంలో సుమారు 1600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నాటసారా తయారీ, విక్రయాలపై సమాచారం ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ దాడుల్లో రామచంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి



త్రినాథ్ (ఫైల్)

కవిటి: మండలంలోని గొర్లెపాడుకు చెందిన తీగల త్రినాథ్ (80) శుక్రవారం రాత్రి పాముకాటుకు గురై మృతి చెందారు. రాత్రి భోజనం చేసిన తరువాత తన ఇంటి గుమ్మం వద్ద కూర్చున్న త్రినాథ్‌కు పాము కరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం బరంపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు.

జనసేన నాయకుల హర్షం

నందిగాం : ఉప ముఖ్యమంత్రిగా, మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు రూరల్ డెవలప్‌మెంట్ బాధ్యతలు చేపట్టారు. దీనిపై మండల జనసేన నాయకులు తాడేల చిరంజీవి ఎస్.షణ్ముఖరావు, పి.సోమేశ్వర రావుతో పాటు పలువురు ఆనందం వ్యక్తం చేశారు. పేద ప్రజలకు ఏదో చేయాలని తపనతో జనసేన పార్టీ స్థాపించారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సమచిత స్థానం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు

మూల్యాంకనంలో లోపాలు సరిదిద్దాలి

ప్రజాశక్తి- పొందూరు



హరిప్రసన్న

ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్న పదో తరగతి మూల్యాకంన ప్రక్రియలోని లోపాలను అధికారులు సరిదిద్దాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న కోరారు. మండలంలోని తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం అందించిన ట్యాబ్‌ల్లో ఇంటర్నెట్ ఉపయోగించి నిర్ధేశించిన యాప్ ద్వారా పేపర్లు దిద్దాలని సూచనలు ఇచ్చారని అన్నారు. కానీ, చాలా ట్యాబ్‌ల్లో యాప్ కనిపించకపోవడంతో మూల్యాంకనంలో పాల్గొన్న గణిత ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. టెక్నికల్ సహాయం కోరినా పట్టించుకునేవారు లేకపోవడంతో ఆన్‌లైన్ ప్రక్రియలో పాల్గొనేందుకు ఆసక్తి చూపిన ఉపాధ్యాయులకు అవకాశం లేకుండాపోయిందన్నారు. ప్రస్తుతం విధానంలోని లోపాలను సవరించి ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను కోరారు. కొంతమంది ఉపాధ్యాయులు ఆన్‌లైన్ మూల్యాంకన ప్రక్రియలో పాల్గొన్నప్పటికీ దిద్దిన పేపర్లు సబ్మిట్ కావడం లేదని చెబుతున్నారని తెలిపారు. సీనియారిటీ పకారం లిస్టు తయారు చేసి వారికి తగిన విధంగా శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించిన తరువాత ఈ విధానాన్ని అమలు చేసి ఉంటే బాగుండేదని అన్నారు.

అంగన్వాడీ పిలుస్తోంది...

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని దూసి, తొగరాం అంగన్వాడీ సెక్టార్ పరిధిలో అంగన్వాడీ పిలుస్తుంది రా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. దూసిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మావతి ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్త పంచాది లతాదేవి సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. మూడేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అలాగే బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి రాష్ట్ర ప్రభుత్వం అందించే విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వజ్రపుకొత్తూరు: పాఠశాలలు ఒుచుకున్న సమయం... విద్యార్థులు ప్రభుత్వ బడుల్లోనే



ఆమదాలవలస : అవగాహన కల్పిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

చదువుకోవాలనే ఆలోచనతో మండలంలోని కొండపల్లి, గునుపల్లి, ఎం.గాడూరు, బైపల్లి అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా శనివారం అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలు సమన్వయంతో పనిచేసి బడిఈడు పిల్లలను స్థానికంగా పాఠశాలలోనే చేర్పించాలని పలువురిని సూచించారు. అలాగే రెండున్నరేళ్ల వయసు పిల్లలను అంగన్వాడీలో చేర్పిస్తే ఆట, పాటల ద్వారా విద్యపై ఆసక్తి పెంచుకొని భవిష్యత్‌లో పాఠశాలకు వెళ్తారన్నారు.

రవికుమార్‌కు మంత్రి పదవి ఇవ్వాలి



మాట్లాడుతున్న రాజారావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు చంద్రబాబు క్యాబినెట్‌లో స్థానం కల్పించాలని న్యాయవాది కూన రాజారావు డిమాండ్ చేశారు. నగరంలోని చిన్నబజార్ రోడ్‌లో ఉన్న క్లాత్ అండ్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 నుంచి 24 వరకు జిల్లాలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో ఆయన జిల్లా సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. అనేక ధఫాలుగా అరెస్టుల కోసం ప్రయత్నించిన పోలీసుల నుంచి తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. జిల్లాలోని అన్ని సామాజిక తరగతులతో సత్సంబంధాలు ఉన్న వ్యక్తిని మంత్రి పదవి ఇవ్వకుండా అన్యాయం చేశారన్నారు. సమావేశంలో మాజీ సర్పంచ్ అన్యపు శ్రీనివాసరావు, ఎంపిటిసి ప్రతినిధి కూన కృష్ణమూర్తి, కో-ఆపరేటివ్ మాజీ నంబరు అన్యపు జనార్ధనరావు, రఘుపతి వాసుదేవారావు, సీపాన వేణు, మీరాబాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు అభినందనలు



శ్రీకాకుళం అర్బన్ : పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం నాయకులు నూతనంగా ఎన్నికైన పలువురు ఎమ్మెల్యేలను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. దుశ్శాలువలు కప్పి సత్కరించారు. ఎమ్మెల్యేలను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీరాములు, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పప్పల వేణుగోపాలరావు, జిల్లా కార్యదర్శి బి.వి.వి.ఎన్.రాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.కె.శ్రీనివాసరావు, శ్రీకాకుళం డివిజన్ కార్యదర్శి డి.ప్రకాశరావు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్...

శ్రీకాకుళం అర్బన్ : ఎమ్మెల్యే గొండు శంకర్‌ను జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. కలిసిన వారిలో అసోసియేషన్ చైర్మన్ నటుకుల మోహన్, కార్యవర్గ సభ్యులు అనుమంచిపల్లి వేణుగోపాలరావు, రెడ్డి గిరిజాశంకర్, రౌతు సూర్యనారాయణ, నక్క రామకృష్ణ, అజయ్ చక్రవర్తి, గండేపల్లి జగన్నాథరావు, సునీల్, సన్నీ, రాము ఉన్నారు.

పలాస : టిడిపి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు మదర్ థెరీసా పాఠశాల చైర్మన్ వజ్జ బాబూరావు, కరస్పాండెంట్ వజ్జ గంగా భవానితో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ ప్రసాదరావు, జోగారావు, కూర్మారావు, చిరంజీవి, సాసుమాన చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి, కాశీబుగ్గ సిఐ విజయానంద్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్‌అండ్‌బి ఎఇ విక్రం, ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, కాశీబుగ్గ సూర్యతేజ జూనియర్, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ దానేటి పద్మజీ, దానేటి కామేశ్వరరావు, సిబ్బంది, యుటిఎఫ్ మండల నాయకులు ఎల్.వి.చలం, కంచరాన జయరాం, కంచరాన రమేష్, టి.అప్పారావు, గొర్లె



పలాస : శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు



కవిటి : సత్కరిస్తున్న సచివాలయ ఉద్యోగులు

నాగేశ్వరరావు, గోరు శ్రీనివాసరావులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్ పుష్పగుచ్ఛం అందజేశారు.

కవిటి: ముచ్చటగా మూడోసారి విజయం సాధించిన ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని రామయ్యపుట్టుగలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ విలేజ్ వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం సభ్యులు ఎమ్మెల్యేను సత్కరించారు. నాలుగు మండలాల పరిధిలోని అధికారులతో పాటు పార్టీ శ్రేణు లు, అభిమానులు, సన్నిహితులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇచ్ఛాపురం మండల ఆర్‌అండ్‌బి యూనియన్, కవిటి మండలం అంగన్వాడీ వర్కర్ల యూనియన్, ఆటో యూనియన్, స్వచ్ఛరక్ష యూనియన్ నాయకులు శుభాంక్షలు తెలిపారు.



ప్రారంభిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

శ్మశానవాటిక అభివృద్ధి పనులు ప్రారంభం

కంచిలి: మండల కేంద్రం కంచిలి శివార్లలో ఉన్న శ్మశాన అభివృద్ధి పనులను సోంపేట రోటరీ క్లబ్, కంచిలికి చెందిన కొత్తకోట నాగరాజు కలిసి చేపట్టిన సంగతి తెలిసిందే. శ్మశాన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో శనివారం సాయంత్రం వాటిని లాంఛనంగా ప్రారంభించారు. సుమారు రూ.32 లక్షలతో శ్మశానం చుట్టూ ప్రహరీ, విశ్రాంతి మండపం, బోరు ఏర్పాటుతో పాటు ఇతర అభివృద్ధి పనులను చేపట్టినట్లు రోటరీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ సుబ్బారావు, రోటరీక్లబ్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, కొత్తకోట నాగరాజు, ఎంపిపి దేవదాస్‌రెడ్డి, ఇప్పిలి కృష్ణారావు, బి.కామేష్‌రెడ్డి, జగదీష్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షునిగా గౌరీశంకర్‌రెడ్డి

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండల నూతన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా సీనియర్ విలేకరి దూపాన గౌరీ శంకర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంతబొమ్మాళి ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శనివారం విలేకరి కర్రి శంకర్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. ఈ మేరకు ఉపాధ్యక్షునిగా సూరాడ జోగారావు, ప్రధాన కార్యదర్శిగా పాండవ సంతోష్, కోశాధికారిగా పి.నగేష్‌శర్మలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు సీరపు



సన్మానిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

రవికుమార్‌రెడ్డి, పిరియా చంద్రశేఖర్, మణిపాత్రుని శ్రీనివాస్, బైపల్లి భీమారావు, లోపింటి ప్రసాద్ రెడ్డి, సదా శివ, జెనేల భానుప్రకాష్‌లను ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న కిరణ్ కుమార్

ప్రజా పక్షాన ఉంటా...

రణస్థలం: ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన ఉండి సమస్యలపై పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లిలో తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ కార్యకర్తలతో, నాయకులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం సమిష్టిగా పోరాటం సాగిద్దామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు సనపల నారాయణరావు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బల్లాడ జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

ఎండియు ఆపరేటర్ సస్పెన్షన్


'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

ఎండియు ఆపరేటర్ చేతివాటం అంటూ శనివారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. చేతివాటం ప్రదర్శించిన ఎండియు ఆపరేటర్ టునా బెహరా అలియాస్ సంతోష్ బెహరాను సస్పెండ్ చేస్తూ రెవెన్యూ డివిజనల్ అధికారి భరత్ నాయక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు విలేజ్ రెవెన్యూ అధికారుల ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు.

హోంమంత్రిని కలిసిన రామకృష్ణ

ప్రజాశక్తి- బూర్జ



హోంమంత్రి వంగలపూడి అనితను జెడ్‌పిటిసి మాజీ సభ్యులు ఎ.రామకృష్ణ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల హోంమంత్రి మంత్రిగా బాధ్యతలు స్వీకరించడంతో విజయవాడలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో దిగజారిన శాంతిభద్రతలను సమర్దవంతంగా గాడిలో పెట్టేలా పాలన అందించాలని కోరారు.

చంద్రబాబు నిర్ణయం హర్షణీయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



శ్రీధర్

ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఫొటో కూడా ఉండే విధంగా చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని జనసేన నాయకులు, డాక్టర్ దానేటి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పవన్ కళ్యాణ్‌కు ఎక్కడా ప్రాధాన్యత తగ్గకూడదన్న ఆలోచన ఆనందాన్నిస్తోందన్నారు. ఎన్నికల్లో కూటమి విజయంలో కీలకంగా వ్యవహరించిన పవన్‌కళ్యాణ్‌పై, ఆయన మనవీయ విలువలపై గౌరవాన్ని పెంచారన్నారు.


విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్

వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- కవిటి

వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులతో మమేకమై సమయానికి రైతులకు అవసరమైన మేర విత్తనాలు అందించాలని ఎమ్మెల్యే అశోక్ సూచించారు. మండలంలోని ప్రగడపుట్టుగలో శనివారం రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల కాలంలో సమయానికి అవసరమైన విత్తనాలు తమకు అందడం లేదని చాలా మంది రైతులు తన దృష్టికి తీసుకువచ్చినట్టు తెలిపారు. ఇకపై అలా కాకుండా సకాలంలో రైతులకు అవసరమైన విత్తనాలు పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. ఎడిఎ జగన్మోహనరావు మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 828 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు, 3898 క్వింటాళ్ల వరి విత్తనాలు రైతులకు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సీపాన వెంకటరమణ, బెందాళం రమేష్, మణిచంద్ర ప్రకాష్, సంతోష్ పట్నాయక్, ఆరింగి మధు, పండి దేవేంద్రమూర్తి, బెందాళం తిరుమల, నాలుగు మండలాల ఎఒలు బి.నరసింహమూర్తి, తిలక్‌వర్మ, ధనుంజయ, భార్గవి పాల్గొన్నారు.


పరికరాలను పరిశీలిస్తున్న ఇఇ బయ్యన్నాయుడు

విపత్తుల వేళ అప్రమత్తం

ప్రజాశక్తి- పొందూరు

వర్షాకాలం ప్రారంభం కావడంతో అకస్మాత్తుగా వీచే ఈదురుగాలులు, వర్షాలపై విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఇఇ ఎస్.బయ్యన్నాయుడు పేర్కొన్నారు. పొందూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శుక్రవారం సాయంత్రం వీచిన గాలులకు, కురిసిన వర్షానికి జిల్లాలో సుమారు 50 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు గుర్తించామని తెలిపారు. అనంతరం సబ్‌స్టేషన్ పరిసరాలలోని విద్యుత్ పరికరాలను పరిశీలించారు. అలాగే ఉపకేంద్రం చుట్టూ పెరిగిపోయిన పిచ్చిమొక్కలును వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈయనతో పాటు ఎడిఇ యు.వి.రమణమూర్తి, ఎఇ పైడి దుర్గాప్రసాద్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న వైద్యాధికారులు

రక్తదానంపై అపోహలు వద్దు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రక్తదానంపై అపోహలొద్దని, ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని బ్లడ్‌బ్యాంకు వైద్యాధికారి వి.సునీత అన్నారు. వరల్డ్ బ్లడ్ డోనర్స్ డే వారోత్సవాల్లో భాగంగా సంఘం అధ్యక్షులు సీపాన సంతోష్, రమణలను రిమ్స్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యాన శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా రక్తం కొరత ఉన్న సమయంలో వారిని సంప్రదించడం ద్వారా రక్తదాతలను తీసుకురావడంతో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. అత్యవసర పరిస్థితిలో రక్తం దొరక్క ఇబ్బందులు పడుతున్నామ అన్నారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీత, స్టాఫ్‌నర్స్, బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్స్, కౌన్సిలర్ తాతారావు, చేయి చేయి కలుపుదాం జనరల్ సెక్రటరీ బొబ్బిలిపల్లి. వినోద్ కుమార్, ట్రెజరర్. సిద్ధు, సతీష్, బాలు, సాయి, యువరాజ్, నాగరాజ్ పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలల తనిఖీ

ఇచ్ఛాపురం : పట్టణంలోని హెబ్రోన్, స్వర్ణభారతి, రవీంద్ర భారతి ప్రయివేటు పాఠశాలలను ఎంఇఒ అప్పారావు శనివారం తనిఖీ చేశారు. పాఠశాలకు సంబంధిత రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు తగ్గట్టుగా పాఠశాలను నిర్వహించాలని యాజమాన్యానికి సూచించారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

మరమ్మతులకు నోచుకునేదెప్పుడో?

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో ఇటీవల కురిసిన చెదురుమదురు వర్షాలకు ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. అయితే ఈ ఏడాది వంశధార ప్రధాన ఎడమ కాలువ పూడికతీత పనులు ఎక్కడ చేయలేదు. అలాగే క్షేత్రస్థాయిలో వెళ్లే పిల్ల కాలువలు మాత్రం గత నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోక పూడికతో, పిచ్చిమొక్కలతో మూసుకుపోయాయి. వీటి జోలికి మాత్రం ఏవరుపోవడం లేదని పలువురు రైతులు అందోళన వ్యక్తం చేస్తున్నారు. వంశధార కాలువలు విడిచిపెట్టే సమయంలో ఈ పిల్ల కాలువల పనులను నిర్వహిస్తే ఇబ్బడి ముబ్బడిగా పనులు చేపట్టి మమ అనిపించుకుంటారే తప్ప దిగువ రైతులకు సాగునీరందే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంశధార ప్రధాన ఎడమ కాలువ కింద గల 25 ఆర్ మేఘవరం నుంచి 40 ఆర్ తాళ్లవలస వరకు గల పిల్ల కాలువలు పిచ్చి మొక్కలతో పూడికతో నామ రూపాలు లేకుండా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిల్ల కాలువలకు పనులు కల్పించి ఖరీఫ్ సీజన్‌కు పూర్తి స్థాయిలో దిగువ రైతులకు నీరందివ్వాలని పలువురు కోరుతున్నారు.


పిచ్చి మొక్కలతో నిండి ఉన్న వంశధార పిల్ల కాలువ

పూడికతీత పనులు పరిశీలన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వర్షాకాలం నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలోని వార్డుల్లో కాలువల పూడికతీత పనులు మొదలుపెట్టారు. సుమారు రూ.పది లక్షల వ్యయంతో జనరల్ ఫండ్ నిధుల నుంచి ఈ పనులు ప్రారంభించారు. నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా పూడికతీత పనులను పరిశీలించారు. నగర పరిధిలోని సీపన్నాయుడిపేట వద్ద చేపట్టిన పనులను ఆమె పరిశీలించారు. గ్రామంలో కాలువలు సరిగ్గా లేక మురుగునీటి సమస్య తీవ్రంగా ఉందని టిడిపికి చెందిన మాజీ కౌన్సిలర్ సీపాన మల్లేశ్వరరావు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోవడం వల్ల దోమల బెడద ఎక్కువైందని వివరించారు. వర్షాలు రాక ముందే పూడికతీత పనులు పూర్తి చేయడం వల్ల వర్షపు నీరు నిల్వ లేకుండా ఉంటుందని వివరించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న సాగునీటి కాలువల్లో సైతం పూడికతీత చేపడితే రైతులకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు.


పనులను పరిశీలిస్తున్న కమిషనర్ తమీమ్ అన్సారియా

విమాన ప్రయాణికులకు సౌకర్యాల మెరుగు

జిల్లా విమాన ప్రయాణికుల సంఘం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విమాన ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే జిల్లా విమాన ప్రయాణికుల సంఘం లక్ష్యమని, అదే లక్ష్యంతో సంఘం పనిచేస్తోందని సంఘ ప్రతినిధులు నటుకుల మోహన్, సురంగి మోహనరావు అన్నారు. నగరంలోని సంఘ సర్వసభ్య సమావేశం ప్రైవేటు హోటల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన సేవలతో పాటు సులభతరమైన ధరలకు సామాన్యులు సైతం విమాన ప్రయాణం చేసేందుకు వీలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడుకు పౌర విమానయాన శాఖ మంత్రి పదవి దక్కడం అభినందనీయమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు కేంద్ర బిందువైన విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలో ప్రధాన నగరాలకు, చారిత్రక ప్రదేశాలకు విమాన సౌకర్యం కల్పించేందుకు అవసరమైన అనుమతులు తీసుకురావడానికి అవకాశం దక్కిందన్నారు. విశాఖపట్నం నుంచి వారణాశి, దుబాయ్ వంటి ప్రాంతాలకు విమాన సౌకర్యం కల్పించేందుకు కేంద్ర మంత్రిగా రామ్మోహననాయుడు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎన్.నారాయణరావు, జిల్లా విమాన ప్రయాణికుల సంఘం ప్రతినిధులు పొన్నాడ రవికుమార్, బాడాన దేవభూషణరావు, ఉరిటి శ్రీనివాసరావు, ఎస్.జోగినాయుడు, కొంక్యాన సుభాష్, బి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నటుకుల మోహన్

గోపికి 'హరివిల్లు కవీశ్వర' పురస్కారం

ప్రజాశక్తి- కవిటి


గోపి

హరివిల్లు లఘు కవితా ప్రక్రియలు కవిటికు చెందిన ఉపాధ్యాయుడు మొర్రి గోపి సహస్ర హరివిల్లులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా భద్రాది సాహితీ వేదిక తెలంగాణ వారు 'హరివిల్లు కవీశ్వర' పురస్కారం ప్రదానం చేశారు. అలతి పదాలతో ఆనంద హరివిల్లు విరబూసి నాలుగేళ్లగా హరివిల్లు ప్రక్రియలో కవనం కొనసాగిస్తున్నారు. ఈ మేరకు గోపికి హరివిల్లు ప్రక్రియ రూపకర్త మామిడి రమేష్, భద్రాది సహితి వేదిక అధ్యక్షుడు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి చిట్టి మధు, వ్యవస్థా వ్యవస్థాపక అధ్యక్షుడు మోహనరావు అభినందించారు. కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.శాంతి గోపిని అభినందించారు.


మాట్లాడుతున్న గిరిబాబు

మహిళా ఆర్థికాభివృద్ధికి కృషి

పలాస: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. మెప్మా కార్యాలయంలో సిబ్బందితో గురువారం సమీక్షించారు. 2023-24 సంవత్సరాలకు సంబంధించి ఆర్థిక లావాదేవీలు, మెప్మా పరిధిలో సంతృప్తికరంగా చేపట్టారని అన్నారు. అదేవిధంగా 2024-25 ఏడాదికి సంబంధించి జిల్లా ఐబి, ఎల్‌హెచ్, బిఎస్‌లపై చర్చించి వాటిపై సంఘాలకు శిక్షణ అందించామన్నారు. గతేడాది మాదిరిగానే మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న పొదుపు రణాలు ఎప్పటికప్పుడు సకాలంలో చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ నాగేంద్రకుమార్, వి.ఎం.ఎం.మోహన్, ఆర్‌పిలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియాలు

కొనసాగుతున్న దీక్ష

కవిటి: తమ బిడ్డల భవిష్యత్ కోసం తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. తమ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలో భాగంగా 171వ రోజుకు చేరుకుంది. శనివారం దీక్షలో బొరివంక గ్రామస్తులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తమకు గుర్తింపు, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బల్లెడ మోహనరావు, వార్డు మెంబర్ సనపల శ్రీపతి పాల్గొన్నారు.

'108' పరిశీలన

ప్రజాశక్తి- మందస


మెళియాపుట్టి : రికార్డులను పరిశీలిస్తున్న జగన్

మందస మండల కేంద్రంలో 108 అంబులెన్స్ సేవలపై డివిజనల్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు శనివారం పరిశీలించారు. వాహన నిర్వహణ తీరు, పరికరాల పనితీరు, అత్యవసర మందుల నిర్వహణ, రికార్డులు, విధుల ఛార్ట్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది ఎ.మోహనరావు, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో అత్యవసర సేవలు కోసం ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్ పనితీరును పలాస డివిజన్ పర్యవేక్షణ అధికారి జగన్ ఆకస్మిక తనిఖీ చేశారు. వాహనంలోని పరికరాలు, మందులు, రికార్డులను పరిశీలించారు. ఈయనతో పాటు పాటు ఇఎంటి సరోజినీ, పైలెట్ చంద్రశేఖర్ ఉన్నారు.


మందులను పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి స్పందన

సోంపేట : మండలంలోని బారువకొత్తూరులో స్థానిక సాగర మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యాన శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు పృథ్వీరాజ్, వీక్షిత, గాయత్రిలు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు 275 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో 25 మందిని జెమ్స్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ బి.చిన్నారావు, పిఆర్ఒ గోపి పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పాలవలసలో శనివారం మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. అక్రమార్కులు ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలించకపోతున్నారని గ్రామస్తుల ఆరోపిస్తున్నారు రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ రియల్ భూముల్లో చదును కోసం మట్టిని తరలిస్తున్నారని తెలిపారు. రోజూ పగలు, రాత్రి అనే తేడా లేకుండా ట్రాక్టర్లపై మట్టిని అనుమతులు లేకుండా తరించుకుపోతున్నారు. దీనిపై అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ మట్టి తరలింపును అరికట్టాలని స్థానికుల కోరుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక తహశీల్దార్ అంబేద్కర్‌ను వివరణ కోరగా... పట్టి తరలింపునకు ఎవరికి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ట్రాక్టర్‌తో తరలిస్తున్న మట్టి

ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని పుటియాదల పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి సాగుకు సహకరించాలని రైతులు కోరారు. ఈ మేరకు ఎఇ నేతాజీని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ పుటియాదలలో సుమారు 50కి పైగా వ్యవసాయ మోటార్లు ఉంటే... ఒక్కటే ఒక 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్ ఉందని తెలిపారు. దీంతో ఓవర్ లోడ్ కారణంగా తరచూ ఫీజులు కొట్టేడం, ట్రిప్ అవ్వడం, కేశారాలు పాడవుతున్నాయని తెలిపారు. దీంతో సాగు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కావాలని ఇది వరకే చాలాసార్లు అడిగినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మరో ట్రాన్స్‌ఫార్మర్ మజురు చేయాలని కోరారు. దీనిపై ఎఇ స్పందిస్తూ పుటియాదల రైతుల కోసం ట్రాన్స్‌ఫార్మర్ కావాలని ఇప్పటికే అధికారులను కోరామని తెలిపారు. అనివార్య కారణాల వల్ల మంజూరు కాలేదని అన్నారు. రైతుల సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ

పొందూరు : మండల పరిధిలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను శనివారం పునరుద్ధరించారు. మండలంలోని తండ్యాం, మలకాం, పెనుబర్తి, బొడ్డేపల్లి, వావిలపల్లిపేట కూడలితో పాటు పలుచోట్ల మొత్తం 12 విద్యుత్ స్తంభాలు పడిపోయినట్లు ఎడిఇ యు.వి.రమణమూర్తి, ఎఇ పైడి దుర్గాప్రసాద్‌లు తెలిపారు. నేలకొరిగిన విద్యుత్ స్థంభాల స్థానంలో కొత్త స్తంభాల ఏర్పాటు పనులను త్వరితగతిన చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు తెలిపారు.


స్తంభాన్ని పునరుద్ధరిస్తున్న సిబ్బంది